# సూక్ష్మంలో మోక్షం-నిత్యానందానికి

మీరంతా - ఎబ్బే ! మీరేమిటి ? మేమేమిటి? మీరు + మేము=మనమందరం, ప్రతిఒక్కరం నిరంతరం

"ఆనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే"

అనురాగపుటంచులూ, ఆనందపులోతులూ చూడాలని వేచుకొని కాచుకొని వున్నాం. కాదంటారా?

'కాదు' అనేవాళ్లుకూడా వున్నారుగాని, వాళ్లు యీ తరంవాళ్లుకాదు. వెనుకటి తరంవాళ్లు.

"—మీరు మనసారగా ఏడ్వగానీరు నన్ను - నన్ను విడిచి చూడండి. వెక్కి వెక్కి ఏడుస్తాను. విసుగూ విరామమూ లేకుండా ఘోరంగా ఏడ్చేస్తాను. గొంతెత్తి ఏడుస్తాను. హోరుమని ఏడుస్తాను. నన్ను వదలండి..."

అంటూ ఏడ్చే స్వతంత్రం కోసం తెగ గింజుకుని, చివరకు గుడ్లల్లో నీళ్లు గుడ్లల్లోనే కుక్కుకునేందుకూడా తడిలేక, నోట్లో గుడ్డలు కుక్కేసుకున్నారు.

యీ కాలపువాళ్లు ఏడ్చేందుకు నోరు రాకనో, కార్చేందుకు నీరులేకనో, పళ్ల పటపటలూ, పిడికిళ్ల

ఝుళిపింపులూ, నరాల బిగింపులూ సాగించారు.

మొత్తంమీద వీళ్లంతా ఈ ఏడుపుగొట్టు ప్రపంచానికి 'సూక్ష్మంలో మోక్షం' చూపించే ఉపాయం తోచక అపాయంలోపడి ఒకసారి విలపిస్తే, మరోసారి పలవించారు.

అబ్బ! యీ భూప్రపంచమ్మీద ఎటు చూచినా ఒకటే బాధలూ ఒకటే దుఃఖాలూ గదా!

ఒకడికి పనిలేకై తేం—మరోడికి భూమి లేకై తేం—యింకోడికి అవకాశం లేకై తేం? మొత్తంగా అందరికీ అనేకంలేక అఘోరిస్తూనే వున్నారు. యిలా అంటే—

"పెద్ద పెద్ద సంపన్నుల మాటేమిటీ?" అంటారు.

ఎంత చెట్టుకు అంతేగాలి.

అష్టైశ్వర్యాలూ వుండికూడా — 'అఖిల ప్రపంచంమీద ఆధిపత్యం రాకపోయెనే!' అని అమెరికా సామ్రాజ్యవాదం ఏడ్చే ఏడ్పుకు అంతుందా?

ఎబ్బే! అంతా ఏడ్పుగొట్టు ప్రపంచం అయిపోయిందండీ!

సాహిద్ ఆఫ్ బాల్ఖ్ అంటాడూ—

"దుఃఖమేగనుక పొగలు చిమ్మినట్లయితే

యీపాటికే యీ ప్రపంచమంతా ఆ పొగల్లో ఉక్కిరి బిక్కిరి అయిపోయి వుండేది'' అని-

నాకూ అదే భయం. దుఃఖానికి యింతవరకూ ఆ సత్తా లేదనుకోండి. అయితే యిక ముందుకూడా ఆశక్తి కలగదని ఎక్కడ వుంది?

నిజంగానే అలా జరిగి - పరిపాలించబడవలసిన మనమంతా ఆపొగలో ఉక్కిరిబిక్కిరై అయిపోతే-పాపం! మన పెద్ద నాయకులు యింకెవర్ని పరిపాలిస్తారూ!

నాకు అదే దిగులు. అందుకనే యీ దుఃఖాన్ని బాధల్నీ అధిగమించడానికి అదీ సూక్ష్మంలో మోక్షంగా వుండే మార్గంచూపి పుణ్యం కట్టుకుందామను కుంటు న్నాను.

దాన్ని ఆంధ్ర, అఖిలభారత, అఖిలఆసియా, అంతర్జాతీయ అలా అలా హనుమంతుడి వాలంలా, ఆచార్య రంగాగారి అంతర్జాతీయ వివిధ సంఘాల్లా, విశ్వ వ్యాపితంచేసి విశ్వమానవ ప్రయోజకత్వం సాధించాలను కుంటున్నాను.

ఇంతకు ఆ సూత్రం ఏమంటే- ?

''నిరంతరం ఆనందాన్ని అనుభవించాలంటే బాధలోను దుఃఖంలోను కూడా అవలంబించవలసిన ముఖ్యాంశాలు యివీ -

అ. ప్రస్తుత స్థితిలో సంతృప్తి పొందడం;

ఆ. అంతకన్నా విషమపరిస్థితులు రానందుకు ఆనందించడం.'' అన్నాడు ఛెకోవ్.

మన భారత ప్రధాని నెహ్రూజీనే చూడండి. కరువుతో సర్వనాశనమౌతోన్న రాయలసీమ వెళ్లాడు పర్యటనకు -ఆ శ్మశానవాటికలో, ఆ శవాలగుట్టలమధ్య, ఉప్పెనలా పొంగుతున్న దుఃఖసముద్రపు లోతుల్లో - ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి, ఆనందంలో తన్మయుడై అరగన్నులు మోడ్చి పత్రికల్లో ప్రకృతి సౌందర్యాన్ని పిండిపోశాడు. పండితుడు, మహాత్ముడు, అహింసామూర్తి గదూ.

మా అమ్మమ్మా అంతే. మా తాతయ్య చచ్చిపోయినందుకు ఏడవదు. ఆ కట్టెల్లోనే తనను కాలవెయ్యనందుకు ఆనందిస్తుంది.

మన నెహ్రూపండితుడూ అంతే. రాయల సీమ ప్రజలకు గంజికూడా కరువైనందుకు బాధపడడు. అది తానూ నిత్యమూ తాగే పాయసంలావుందని ఆనందిస్తాడు.

మా అమ్మమ్మా, మన నెహ్రూ యిద్దరే యిద్దరూ యీ యావద్భారతంలోనూ యీ పవిత్ర సూత్రాన్ని అన్వయించుకుని ఆచరణలోపెట్టగల ధీరులు-.

సూక్ష్మంలో మోక్షం-నిత్యానందానికి

మహాకవి శ్రీ. శ్రీ. అంతటివాడు.

''ముక్కుపచ్చలారని నవ్యాంధ్రరాష్ట్ర శిశువు

మూలుగుతూ మూలనున్న ముసలాడికి వధువు"

అని బాధపడతాడేగాని - చచ్చిన శవానికి కట్టబెట్టనందుకు సంతోషించలేకపోయె. సామాన్యులం మనమాటకేమొచ్చె. అలా అనుకొని వూరుకుని ఉరివేసుకుంటామా?

— మన కాంగ్రెస్ ప్రభుత్వమూ,అందులో వున్న మంత్రులూ, — వాళ్లు మాత్రం పాపం! ఏం చేస్తారూ? వాళ్ళకి వాళ్లు చేసుకోడమే సరిపోతుండె. ప్రజలకు 'ఏంచెయ్యడానికీ 'వాళ్ళకు రోజులు చాలాయిగాదు' మరి —

అందుకనే క్షణ క్షణం చెబుతున్నారు. ''ఇది ప్రజాస్వామికయుగం. ప్రభుత్వం ప్రజలకు చేసేది ఏమీ వుండదు. ప్రజలే చేసుకోవాలి''-అని.

నిజం. ప్రజలే చెయ్యిచేసుకోవాలి. ఏదో అప్పుడుగాని తేలదు. కనుకనే మనం నైరాశ్యంలేక అమ్మమ్మగార్లను ఆరాధిస్తూ, వాళ్ల అడుగు జాడల్లో వెళిపోదాం,

ఛెకోవ్-తన సూత్రాన్ని జీవితానికి అన్వయిస్తూ చెప్పాడూ- "కాలులో ముల్లు గుచ్చుకొంటే కంట్లో గుచ్చుకోనందుకు సంతోషించు.'' అని -

అలాగే మనము మన జీవితాలకు అన్వయించుకుంటే నిరంతరఆనందానికినిచ్చెనలువేసుకుంటూ వెళిపోతాం.

యివిగో-ఉదాహరణకు-

నిత్యం-మీ ప్రక్క-యింటి రేడియోలో గాడిదలు కూస్తూ గొడవచేస్తున్నాయనుకోండి. అవి అంతటితోనే ఆగినందుకూ; మనమీదికే దూకనందుకూ; దూకి వెనకకాళ్లతో విన్యాసాలు సాగించనందుకూ సంతోషించవచ్చుగదా!

మీ బ్రతుకులు భారంగా వున్నాయని బాధపడుతున్నారా? ఎందుకూ? ఆ భారపు బ్రతుకులైనా అలాగే వున్నందుకూ; మననించి దూరంకానందుకూ ఆనందించండి.

మీ మీద పన్నులు మోయలేనంతగా పడితే- అవి తన్నులు కానందుకూ; అదీ జరిగితే - అవి గుండెల్లో దూసిన సన్నీలు కానందుకూ సంతోషపడండి.

కరువూ కాటకాలు వచ్చి మీ మీదపడితే- ఆ పడ్డది చావుకానందుకు వెయ్యి విధాల సంతోషించండి.

విసుగెత్తిన జీవితాన్ని సరదాతో నింపుదామని సినీమాకు పోతే - అక్కడ ఏడుపుకూ - సంగీతా

నికీ సరిహద్దు తెలియక మీరు విపరీత విపత్కర పరిస్థితుల్లో పడ్డా చింతించకండి. అది ఏడుపూ, సంగీతమూ రెండూ కావనీ; పాట రాక ఏడుపూ, ఏడ్వలేక పాటా మాత్రమే అనీ; ఏడ్చేవాళ్ళచేతమాత్రమే పాడిస్తున్నారనీ, చచ్చినవాళ్ళచేత సైతం పాటలు పాడించేంత సాహసానికి యింకా తెలుగు సినిమారంగం దిగలేదనీ ఆనందించుదాం.

ఫ్యాక్టరీలు మూసేసి, భూముల్లోనించి తగిలేసి మిమ్మల్ని నిరుద్యోగులుగా బజార్లోకితోసేస్తే-అది బంగాళా ఖాతం, అరేబియా, హిందూ మహాసముద్రాలలో ఏ ఒక్కదాంట్లోనూ తోసెయ్యనందుకూ, అదీ జరిగితే మూడు సముద్రాల్లోకీ ఒకేసారి తోసెయ్యనందుకూ ఆనందించటానికి అవకాశంవుంది.

మీభార్యాబిడ్డలూ, వగైరావగైరా తిండికిలేక చస్తే-అది మీరే కానందుకూ; అదికూడా జరిగితే మీరు తిండికిలేక చచ్చారనే న్యూనత ప్రపంచంలో ప్రచారం కానందుకూ సంతోషించండి.

మీరు చచ్చాక ఏం జరిగిందోమీకు తెలియని మాట నిజమేఅయినా-మీరు 'చచ్చింది తిండిలేకనే' అనే విషయాన్ని ప్రపంచానికి తెలియకుండా ప్రభుత్వం పకడ్బందీ చేస్తుంది. ఇది ఖచ్చితం. యీ హామీతో మీరు నిశ్చింతగా నిత్యా నందంతో మరణించవచ్చు.

ముక్తెసరు

ధరలు పెరిగినందుకు దుఃఖపడకండి. ఆ పెరగడం ఉరులు కానంతవరకూ సంతోషపడవచ్చు.

మిమ్మల్ని చింతబరికెలతో బాదితే - అది ముళ్ళకంప కానందుకూ; జైల్లోపెడితే-అది మిలటరీకాంపు కానందుకూ; తుపాకీతో కాలిస్తే - అది ఆటంబాంబూ హైడ్రోజన్‌బాంబూ కానందుకూ సంతోషించండి.

యిలా ఎవరి జీవితాలకువారు అన్వయించుకుని నిత్యానందాన్ని పొందడం మినహా మరి దారి లేదు.

ఎప్పటిమాట ఏమోగానీ - మన యీ ప్రభుత్వాలు వున్నంతవరకూ యీ నా సూత్రం చిరస్థాయి; శిలా శాసనం.

---